న్యాయవ్యవస్థపై నమ్మకం ఏర్పడింది

ఎమ్మెల్సీ కవిత ఇంటి వద్ద అభిమానుల కోలాహలం

బీఆర్ఎస్ నాయకుల నడుమ ఎమ్మెల్యేలు కేటీఆర్, కౌశిక్ రెడ్డి

మణికొండ, ఆగస్టు 28 : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు లిక్కర్ కేసులో సర్వోన్నత న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడం ద్వారా ప్రజలకు న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఏర్పడిందని బీఆర్ఎస్ నాయకులు సీతారాం ధూళిపాళ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున సీతారాం ధూళిపాళ ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్టుకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కడిగిన ముత్యంలా కవిత బయటకు రావడం ద్వారా న్యాయం, ధర్మమే గెలుస్తుందని నిరూపితమైందన్నారు. కార్యక్రమంలో మణికొండ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభగల్ల ధనరాజ్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, సీనియర్ నాయకులు అందె లక్ష్మణ్‌రావు, సంగం శ్రీకాంత్, ఉపేంద్రనాథ్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, ఆరిఫ్, రామసుబ్బారెడ్డి, మహిళా నాయకురాలు విజయలక్ష్మి, బత్తిని కీర్తిలతాగౌడ్, రేఖ, మంజు, సుమ, అనుష పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు స్వాగత ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న గోవర్ధన్ రెడ్డి, కార్పొరేటర్ కవిత

మిన్నంటిన సంబురాలు.. కవిత ఇంటి వద్ద కోలాహలం

ఖైరతాబాద్ : ఎమ్మెల్సీ కవిత ఇంటి వద్ద కోలాహలం వెల్లివిరిసింది. అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు, జాగృతి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆమె ఇంటి ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొన్నది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బుధవారం రాత్రి 7: 30గంటల ప్రాంతంలో కవిత బంజారాహిల్స్‌లోని ఆమె ఇంటి వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా జై తెలంగాణ నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. గులాబీ తోరణాలు, గిరిజన సంప్రదాయ నృత్యాలు, డప్పు చప్పుళ్లతో కవితకు స్వాగతం పలికారు. బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి నేతృత్వంలో స్వాగతం ఏర్పాట్లు చేయగా, బీఆర్ఎస్ శ్రేణులు పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, పద్మాదేవేందర్, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, భూపాల్ రెడ్డి, కార్పొరేటర్లు మన్నె కవిత, వెల్దండ వెంకటేశ్ స్వాగతం పలికారు.


మణికొండ నుంచి స్వాగతం పలికేందుకు ఎయిర్‌పోర్టుకు వచ్చిన బీఆర్ఎస్ నాయకులు

కవితకు స్వాగతం పలికేందుకు తరలివెళ్లిన బీఆర్ఎస్ మహిళా నాయకులు

సంతోష్‌కుమార్‌కు ఓయూ డాక్టరేట్

మణికొండ, ఆగస్టు 28: గండిపేట లోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ)లో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న కె. సంతోష్‌కుమార్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. తాగూచీ డివోఈ మెథడ్ రెండింటినీ ఉపయోగించడం ద్వారా రెసిప్రొకేటింగ్ కంప్రెషర్‌లో సక్షన్ మఫ్లర్ యొక్క ఆప్టిమైజేషన్ పై ప్రొఫెసర్ కె.కిశోర్, సీనియర్ ప్రొఫెసర్ వి.ఉషశ్రీ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేసిన సంతోష్‌కుమార్‌కు ఓయూ డాక్టరేట్ ప్రదానం చేసింది.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిశీలన

రాజేంద్రనగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డాక్టర్‌తో మాట్లాడుతున్న డీసీ రవికుమార్

బండ్లగూడ, ఆగస్టు 28 : రాజేంద్రనగర్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌ను రాజేంద్రనగర్ డీసీ రవికుమార్ తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. అక్కడికి వస్తున్న రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెల్త్ సెంటర్‌లో మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని డాక్టర్లకు తెలిపారు. డెంగీ, మలేరియా రోగుల సమాచారం వెనువెంటనే అందించాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ ఎంసీ డీఈఈ శ్రీనివాస్, ఏఈ ఎంటామాలజీ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో జేబు దొంగల అరెస్టు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 28 : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో జేబు దొంగలను బుధవారం పోలీసులు అరెస్టు చేసిన ఘటన చోటు చేసుకున్నది. డీఐ నాగేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఎయిర్‌పోర్టుకు వస్తుండడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎయిర్‌పోర్టుకు తరలివచ్చారు. అదే సమయంలో కొందరు అనుమానంగా కనిపించడంతో వారిపై నిఘా పెట్టిన పోలీసులు వారి కదలికలను గమనిస్తుండగా జేబులు కొట్టే ప్రయత్నం చేశారు. దీంతో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద డబ్బులు లభించలేదు. కానీ వారిపై పాతకేసులు ఉన్నాయో అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. పట్టుబడిన వారు హైదరాబాద్ పాతనగరానికిచెందిన ఇద్దరు, మరో నలుగురు హబిబ్‌నగర్ పీఎస్ పరిధిలోని మంగళికుంట బస్తీకి చెందిన వారని చెప్పారు.

దత్తాత్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీనియర్ జర్నలిస్టులు, బంధు మిత్రులు

పాత్రికేయుడికి నివాళి

ఖైరతాబాద్, ఆగస్టు 28 : సీనియర్ జర్నలిస్టు బిట్ల దత్తాత్రి ప్రథమ వర్ధంతి సభ బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టులు, బంధుమిత్రుల ఆధ్వర్యంలో జరిగింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈ సందర్భంగా దత్తాత్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జర్నలిజంలో నిజాయితీగా పనిచేసిన దత్తాత్రి అందరికీ ఆదర్శనీయులని కొనియాడారు. దత్తాత్రి సతీమణి నిర్మల, కుమార్తెలు శ్రావణి, హరిణిలకు ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ, బీఆర్ఎస్ నాయకుడుఎం.ఎన్. శ్రీనివాసరావు, సీనియర్ పాత్రికేయులు గడ్డం నరసింహారావు, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎల్. వేణుగోపాల నాయుడు, సంయుక్త కార్యదర్శి చిలుకూరి హరిప్రసాద్, హెచ్ యూజే నగర అధ్యక్షుడు శంకర్, సీనియర్ పాత్రికేయులు మారుతీసాగర్, అబ్బయ్య గౌడ్, బొల్లం శ్రీనివాస్, వీరారెడ్డి, శ్యాంసుందర్ ఉన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఖైరతాబాద్ ఎమ్మార్వో ఆఫీస్‌లో రహ్మత్‌నగర్‌కు చెందిన 163 మంది కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్‌తో కలిసి చెక్కులు పంపిణీ చేశారు. డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- జూబ్లీహిల్స్

పారిశుధ్య కార్మికులు..ప్రజాసేవకు అంకితం

పారిశుధ్య కార్మికులు ప్రజాసేవకే అంకితమై పని చేస్తారని మేయర్ లత, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం పారిశుధ్య కార్మికులకు శానిటేషన్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ మేనేజర్ నరేశ్, కార్పొరేటర్లు చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, అస్లాంబిన్ అబ్దుల్లా, రాము, ప్రశాంత్‌నాయక్ పాల్గొన్నారు.
- బండ్లగూడ

మైనర్లు వాహనాలు నడపడం నేరం

విద్యార్థులకు హెల్మెట్లు అందజేస్తున్న ఏసీపీ శంకర్‌రాజు, పాఠశాల ఉపాధ్యాయులు

ఖైరతాబాద్, ఆగస్టు 28 : మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్ రాజు అన్నారు. బుధవారం సోమాజిగూడలోని రాజ్‌భవన్ హైస్కూల్‌లో విద్యార్థులకు ట్రాఫిక్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ.. పిల్లలకు వాహనాలు ఇస్తే దాని యజమానులపైనే కేసులు నమోదవుతాయని, వారికి జైలు శిక్షపడే అవకాశం ఉందన్నారు. వాహనదారులు, పిలియన్ రైడర్ సైతం హెల్మెట్ ధరించాలని సూచించారు. పిలియన్ రైడర్ హెల్మెట్ పెట్టుకోకపోవడంతో ఇటీవల బేగంపేట మెట్రోస్టేషన్ వద్ద ఓ యువతి మృతి చెందిందని గుర్తు చేశారు. నాలుగేండ్ల కంటే ఎక్కువ వయస్సు ఉన్న ప్రతిఒక్క రైడర్, పిలియన్ రైడర్లు హెల్మెట్ ధరించాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజ్‌భవన్ హైస్కూల్ హెచ్ఎం కరుణశ్రీ, లత, సురేందర్, గీత పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు మరో అవకాశం..

జూబ్లీహిల్స్ : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నూతన ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ సర్కిల్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 2025 జనవరి వరకు 18 ఏండ్లు నిండనున్న యువత తమ పేర్లు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా అక్టోబర్ 18 వరకు నూతన నమోదు చేపట్టి.. అక్టోబర్ 29 న ముసాయిదా జాబితా విడుదల చేయనున్నారు. నవంబర్ 28 వరకు అభ్యంతరాల స్వీకరణ చేపట్టి 2025 జనవరి 6న ఫైనల్ పబ్లికేషన్ విడుదల చేయనున్నారు. అక్టోబర్ 19 నుంచి 28 వరకు సవరణకు డ్రైవ్ చేపట్టనున్నారు. 2025 జనవరి 1 వరకు 18 ఏండ్లు నిండనున్న యువత పేర్లతో తుది జాబితా విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మార్ఫింగ్ ఫొటోతో వేధింపులు

వెంగళరావునగర్ : మార్ఫింగ్ ఫొటోలతో టెకీని వేధిస్తున్న సంఘటన మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది.. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఓ యువతి గచ్చిబౌలిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ.. మధురానగర్ లోని హాస్టల్‌లో ఉంటుంది. ఇన్‌స్టాలో అమ్మాయిల పేర్లతో క్రియేట్ చేసిన ఐడీతో ఫ్రెండ్ రిక్వెస్టులు వచ్చాయి. దీనికి ఆమె అంగీకరించింది. ఇన్‌స్టాలోని యువతి ఫొటోలను సేకరించి ఎడిట్ చేసి మార్ఫింగ్ చేశాడు. కోరిక తీర్చాలని.. లేకుంటే మార్ఫింగ్ ఫొటోలను అందరికీ షేర్ చేస్తానని బెదిరింపులకు గురిచేశాడు. మీ ఆఫీస్‌లోని అందరికి షేర్ చేస్తానని బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడ్డాడు. ఆ అకౌంట్లను బ్లాక్ చేసిన యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

తల్లిదండ్రులు మందలించడంతో..
- ఇంటి నుంచి వెళ్లిపోయిన యువకుడు

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 28: తల్లిదండ్రులు మందలించడంతో ఓ యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల కథనం ప్రకారం.. కాటేదాన్‌లో అనిల్‌శివరాజ్, సంగీత కుటుంబం ఇరువై ఏండ్లుగా నివసిస్తున్నది. వీరి కుమారుడు ఎస్.మణిక్‌సూర్య . ఈ యువకుడు కొన్ని రోజులుగా ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ.. వివిధ యాప్‌ల ద్వారా లోన్ తీసుకొని గేమ్స్ ఆడుతున్నాడు. ఈ క్రమంలోనే గేమ్ ఆడుతూ.. మూడు వేల రూపాయలు పోగొట్టుకున్నాడు. ఈ విషయమై తల్లిదండ్రులు మణిక్‌సూర్యను మందలించడంతో.. ఈ నెల 15న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఎలాంటి ఆచూకీ తెలియలేదని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మరిన్ని వరి వంగడాలు అవసరం

వ్యవసాయ యూనివర్సిటీ, ఆగస్టు 28 : నేటి కాలమానాలకు అనుగుణంగా మరిన్ని వరి వంగడాలు అవసరం ఉన్నదని ఉత్తరప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి సూర్య ప్రతాప్ సాహీ అన్నారు.బుధవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ భారతీయ వరి పరిశోధన విభాగం (ఐఐఆర్ఆర్) సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన వరి పరిశోధన రంగంపై ఏర్పాటు చేసిన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. వరికి దేశవ్యాప్తంగా డిమాండ్ ఉందని, తెలుగు రాష్ట్రాల్లో 50 శాతం సాగు కావడం హర్షణీయమన్నారు.


సమీక్షా సమావేశంలో ఉత్తరప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి సూర్య ప్రతాప్ సాహీ

తెలంగాణ ఏర్పడ్డాక సాగు పెరిగింది

తెలంగాణ ఏర్పడ్డాక శాస్త్రవేత్తలు, ప్రభుత్వ సహకారంతో సాగు పెరిగిందని తెలుసుకుని అభినందించారు. తమ రాష్ట్రంలో సాంబ మసూరి అధికంగా పండిస్తామని, తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడి ఇచ్చే సన్నరకాలను పరిచయం చేయడానికి కృషి చేస్తామన్నారు. ఇటీవల విడుదల చేసిన ఎనిమిది వరి రకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తమ రాష్ట్ర వాతావరణ పరిస్థితులకు అనువైన రకాలను తెలుసుకున్నారు. డీఆర్ఆర్ బీహెచ్ఏఎన్-73, 74, 76, 77, 78, 79, 80తో పాటు 133 రోజుల్లో దిగుబడినిచ్చే డీఆర్ఆర్ ధన్-51రకం వంగడం, 142 రోజుల్లో దిగుబడినిచ్చే డీఆర్ఆర్ ధన్ -50 రకం వివరాలు తెలుసుకున్నారు. ఇన్‌చార్జి డైరెక్టర్ డా. మహేంద్రకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఉత్తరప్రదేశ్ సహాయ మంత్రి బల్‌దేవ్‌సింహ్ హోల్కా ,ప్రధాన శాస్త్రవేత్తలు సాయిప్రసాద్, జ్యోతి బద్రీనాథ్ , పద్మావతి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి

బండ్లగూడ,ఆగస్టు 28: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తానని కార్పొరేషన్ నూతన అధ్యక్షుడు రావుళ్లకోళ్ల నాగరాజు పేర్కొన్నారు. బుధవారం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డిలు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా నాగరాజు, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా మంద రవీందర్‌రెడిను నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు. సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను గుర్తించి ప్రజల్లో చైతన్యం తేవాలని వారికి సూచించారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని అందరూ గతంలో పార్టీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్ తిరిగి పెద్దఎత్తున పుంజుకుంటుదన్నారు. నాయకులు కార్యకర్తలు ఇప్పటికీ బీఆర్ఎస్ వైపే ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్ట్ చేశారని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని తెలిపారు.

వ్యక్తి కిడ్నాప్ .. నిందితులు అరెస్టు

ఖైరతాబాద్, ఆగస్టు 28 : డబ్బులు తీసుకొని సకాలంలో మెటీరియల్ సరఫరా చేయలేదని ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసిన కేసులో నలుగురు నిందితులను పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. చాంద్రాయణగుట్టకు చెందిన షేక్ జావిద్ చాకెట్లు, బిస్కెట్ల వ్యాపారం చేస్తున్నాడు. ఆర్డర్ మేరకు అవసరమైన వారికి సరఫరా చేస్తాడు. మహారాష్ట్రలోని ఉమ్మార్గ మండలం, దోప్కకు చెందిన ఆరీఫ్ ఇనాందార్ అనే బిస్కెట్ల వ్యాపారితో ఉన్న పరిచయంతో లక్ష రూపాయలకు గాను చాకెట్లు, బిస్కెట్లు సరఫరా చేయడానికి ఒప్పందం చేసుకున్నాడు. డబ్బులు కూడా తీసుకున్నాడు. కానీ.. మెటీరియల్ సరఫరా చేయకపోవడంతో 26న హైదరాబాద్‌కు వచ్చాడు. అమీర్‌పేట్‌లోని పిల్లర్ నం.1067 వద్ద కలుసుకుందామని చెప్పాడు. దీంతో జావిద్ తన బావమరిదిని తీసుకొని అక్కడికి వెళ్లాడు. ఆరీఫ్‌తో పాటు తన వెంట వచ్చిన మహారాష్ట్రలోని ఉస్మానాబాద్‌కు చెందిన చాకెట్ల, బిస్కెట్ వ్యాపారం చేసే అబ్దుల్ హఫీజ్ అలియాస్ షోయబ్, అదే ప్రాంతానికి చెందిన డ్రైవర్ ఫక్రుద్దీన్ అలియాస్ బాబు , మెకానిక్ అజారుద్దీన్ అలియాస్ అజారుద్దీన్ మద్దె తో కలిసి తమ వెంట తెచ్చుకున్న కారులో జావిద్‌ను కిడ్నాప్ చేశారు. ఆ సమయంలో అతని బావమరిది తప్పించుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. బాధితుడి భార్య నేహా నిషాంత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

జనావాసాల్లో పారుతున్న డ్రైనేజీ

బాబుల్‌రెడ్డి నగర్‌లో ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 28 : జనావాసాల్లో డ్రైనేజీల పారుతున్నది. బాబుల్‌రెడ్డినగర్‌లోని సర్సాబాయి కుంట వద్ద సాధారణమైనది. బుధవారం నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో అంగనవాడీ కేంద్రం ఉందని వారికి, ఇతర పాఠశాలల విద్యార్థులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. పైపులైన్లు పగిలిపోవడంతో వానలు పడినపుడు ఇండ్లలోకి డ్రైనేజీ ప్రవహిస్తున్నది. దాంతో రాత్రి విపరీతంగా దోమలు విజృంభిస్తున్నాని, దాంతో అనేక మంది వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు నూతన పైపులైన్లు వేసి సమస్యకు పరిష్కారం చూపించాలని కోరారు.

IN THE COURT OF THE HONOURABLE PRINCIPAL DISTRICT JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT : AT MALKAJGIRI
Tr. O.P. No. 27 Of 2023
Between:
Smt. Challa Gayatri Devi & others ...Petitioners
AND
Katukuri Koteshwar Goud and Others ...Respondents
To,
3. Mohd Ishaq Khan S/o Late Mohd Ibrahim Khan Aged: 54 years, Occ: Business, R/o Plot No.304, Road No.78, Jubilee Hills, Hyd.
4. Smt. Mamatha Muppidi W/o Sri Sitaram Reddy, Aged: 46 years, Occ: Housewife, R/o H.No. 2-22-310, Addagutta Society, Kukatpally, Balanagar, Mandal, Ranga Reddy District - 500085.
(Respondents No.3 and 4 in Tr. O.P. NO. 27 Of 2023)
Sir,
Please take notice that the above-named Petitioners have filed above-referred Transfer Petition against you and others seeking transfer of O.S. No. 95 of 2019 pending on the file of the Honourable Additional Senior Civil Judge to the Court of the Honourable-II Additional District Judge, Medchal-Malkajgiri District, at Medchal to be tried along with O.S. No. 224 of 22019. The above matter is posted on 19-09-2024 for your appearance. You are required to appear before the above-mentioned court on 19.09.2024 at 10.30AM, either in person or through an advocate, and submit your objections if any, failing which the matter will be heard in your absence.
BY ORDER OF THE COURT
Sd/- VENKATESH DESHPANDE, Advocate
2-1-514/4/1, Nallakunta, Hyderabad
500044 Ph. No. 9246546840
Email: vard1601deshpande@gmail.com